క్లుప్తంగా

ముగిసిన నాటక ప్రదర్శన



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

యాలాల: వారం రోజులుగా కమాల్‌పూర్‌లో ప్రదర్శించిన మునిరంగస్వామి వీధి నాటకం శుక్రవారం రాత్రితో ముగిసింది. చాలా ఏళ్ల తరువాత నాటక ప్రదర్శన నిర్వహించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కళాకారులకు పూలమాలలు వేసి సత్కరించారు. బహుమతులు ప్రదానం చేశారు.

పల్లెల్లో హైమాస్ట్ దీప కాంతులు



ముద్దాయిపేట ప్రధాన చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల వెలుతురు

యాలాల: ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)తో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో ప్రతి గ్రామానికి రూ.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీ, ఫార్మేషన్‌రోడ్లతో పాటు ప్రధాన చౌరస్తాల్లో సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మండలంలోని ముద్దాయిపేట, సంగాయగుట్టతండాలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళలో పల్లెల వీధులు హైమాస్ట్ దీపాల కాంతితో కనువిందు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఘనంగా రమాబాయి వర్ధంతి



రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన మార్గంలో పయనిస్తూ అనేక పోరాటాలు చేసిన మహనీయురాలు రమాబాయి అని అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు అన్నారు. అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతి సందర్భంగా శనివారం అంబేద్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలరాజ్, సాయిలు, బాబు, అరవింద్, కనకప్ప, చిన్నయ్య, దేవరాజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి

దోమ: 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు. శనివారం తహసీల్ కార్యాలయంలో బీఎల్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవల్‌లో వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం ఫాం-6లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 23వ తేదీ వరకు ఉంటుందని, క్షేత్ర స్థాయిలో బీఎల్వోలు ఇంటింటికీ తిరుగుతూ పూర్తి చేయాలని చెప్పారు.

గుంతలు పూడ్చివేత



బీజేఆర్ చౌస్తాలో రోడ్డు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వికారాబాద్ అర్బన్: పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు శనివారం మున్సిపల్ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంజుల మాట్లాడారు. డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమంలో పట్టణ ప్రజల నుంచి చాలాసార్లు ప్రధాన రోడ్డు గుంతలుగా మారినట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అందులో భాగంగానే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి రోడ్లల్లో ఏర్పడిన గుంతలను సీసీతో పూడ్చివేయిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణంలో ఎక్కడైనా రోడ్లలో గుంతలు ఏర్పడి ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉదయ్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అందని 'సహకారం'

వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతన్నలకు ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. సాగు పరికరాలు, యంత్రాలపై రాయితీ ఎత్తివేయడం చిన్న, సన్నకారు రైతులకు సాగు కష్టతరంగా మారింది. వెన్నంటి ఉండే సహకార సంఘాల ప్రోత్సాహం లేక.. ఆధునిక వ్యవసాయం సంగతి ఎలా ఉన్నా.. సాంప్రదాయ సాగు కష్టంగా మారిందని కర్షకులు వాపోతున్నారు.

- సబ్సిడీ ఎరువులు, విత్తనాల ఊసేలేదు
- నాలుగేళ్లుగా రైతుల ఎదురుచూపు
- రుణమాఫీపై స్పష్టత కరువు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

దౌల్తాబాద్: రాయితీపై సరఫరా చేసే సాగు సామగ్రికై రైతులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారు. యేటా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా సబ్సిడీపై అందజేసే యంత్రాలు, యంత్రపరికరాలు, ఎరువులు, విత్తనాల ఊసే లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో సహకార సంఘం, వ్యవసాయ అధికారుల నుంచి ఎటువంటి సమాధానం లేదని వాపోతున్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సుమారు 3వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో.. సంఘాలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం ధాన్యం కొనుగోళ్ల వరకే పరిమితమయ్యాయని కర్షకులు చెబుతున్నారు.

నష్టపోతున్న రైతులు

వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, అధిక దిగుబడి సాధించి రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా సహకార సంఘాలు కృషి చేసేవి. సాగు పద్ధతులు, అవసరమైన యంత్ర పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించేది. కానీ నాలుగేళ్లుగా సొసైటీలు అవేవి ఇవ్వడం లేదు. వాటిపై ప్రభుత్వం రాయితీ ఎత్తివేసింది. దీంతో రైతులు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు విక్రయిస్తున్న నాణ్యత లేని ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. ఇక పంట రుణాల్లో రూ.25వేలు మాఫీ అని చెప్పిన ప్రభుత్వం.. నేటికీ స్పష్టత నివ్వకపోవడంతో అప్పు చెల్లించలేక అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు.

శాస్త్రవేత్తల సూచనలేవి?

పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికం కావడంతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు కొరవడి తీవ్రంగా నష్టపోతున్నారు. ఎప్పటికప్పుడు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అధిక దిగుబడి, సేంద్రీయ సేంద్రం, వాటి పద్ధతులు, ఎరువుల వాడకం, లాభసాటి పంటలు సాగుచేసేలా సలహాలు, సూచనలు ఇవ్వాలి. అలాగే అధునాతన సాగు పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర వాటి ధరలు లక్షల్లో ఉంటాయి. వాటిని సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి రైతులకు అద్దెకు ఇవ్వాలి. నమ్మకమైన కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని వానాకాలం సాగుకు తక్కువ ధరకు విత్తనాల పంపిణీకి సంఘాలు కృషి చేయాలి. కానీ ప్రస్తుతం అవేమి లేవని రైతన్నలు ఆరోపిస్తున్నారు.



దౌల్తాబాద్ సహకార సంఘం కార్యాలయం

"నాణ్యమైన విత్తనాలు అందించాలి



మార్కెట్‌లో నకిలీ విత్తనాల దందా ఎక్కువగా ఉంది. చిన్న, సన్నకారు రైతులు అప్పులు తెచ్చి వ్యాపారుల మాటలు నమ్మి నాసిరకం విత్తనాలు కొనుక్కోవాల్సి వస్తోంది. పూతకాత రాక, దిగుబడి లేక నష్టపోతున్నాం. సహకార సంఘాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేయాలి.

– నర్సింహులు, రైతు, దౌల్తాబాద్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుభోదయం కార్యక్రమంలో భాగంగా గురువారం ముబారక్‌పూర్, మైతాప్కాన్ గూడలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సీసీరోడ్డు, డ్రైనేజీ సమస్య తీరుస్తామని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవని, మరో 10 కాలాలపాటు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటే పేదలకు, రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, సర్పంచుల మండల సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, సర్పంచులు బాలమణి, అనిత, బల్వంత్ రెడ్డి, రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, రంగారెడ్డి, ఆనంద్ రెడ్డి, ముకుంద్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అండర్ డ్రైనేజీ సమస్య తీర్చాలి

- కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

వికారాబాద్ అర్బన్: అండర్ డ్రైనేజీ సమస్య పరిష్కారం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశించారు. మీతోనేను కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన 17వ వార్డు మధుకాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాలనీల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, 33 కేవీ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పారు. అనంతరం 17వ వార్డుకు చెందిన ఇద్దరు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

అనంతగిరి: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవనంలో ఎస్సీ కార్పొరేషన్ తరపున మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కమల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు మేత కొరత

- ట్రాక్టర్ వరిగడ్డికి రూ.6వేలు
- రాయితీపై పశుగ్రాసం అందజేయాలంటున్న రైతులు

పెద్దేముల్: మూగ జీవాలకు మేత కరువైంది. వరి గడ్డి తప్ప జొన్న, వేరుశనగ పొట్టు దొరకడం లేదు. ప్రస్తుతం వేరుశనగ పొట్టు, జొన్న చొప్పకు డిమాండ్ ఏర్పడింది. కట్టు చొప్ప రూ.వెయ్యి నుంచి రూ.1,200లు కాగా.. వేరుశనగ పొట్టు ట్రాక్టర్‌కు రూ.4వేల నుంచి 6వేలు పలుకుతోంది. అయినప్పటికీ వేరుశనగ పొట్టు దొరకడం లేదని, అవసరం ఉన్న రైతులు పంట సాగుచేసిన వారికి అడ్వాన్స్ చెల్లించి ఖరీదు చేసుకోవడంతో అవి అందని ద్రాక్షగా మారాయి. గతేడాది రూ.8 వేల నుంచి 10వేల ధర పలికిన వరి గడ్డికి.. ప్రస్తుతం రూ.5 వేల నుంచి 6వేలు ఉంది. ఇదిలా ఉండగా.. మేతకు పెట్టుబడి భారం కావడంతో కొందరు రైతులు పశువులను విక్రయించడం గమనార్హం. మండలంలోని 30 రెవన్యూ గ్రామాల్లో సుమారు 9,995 ఆవులు, ఎద్దులు, 3,271 గేదెలు, 6,759 గొర్రెలు, 14,350 మేకలు ఉన్నాయి. పశువులకు ఏడాదికి సుమారు 8,447 మెట్రిక్ టన్నుల మేత అవసరం ఉండగా ప్రస్తుతం మండలంలో సుమారు 7,854 మెట్రిక్ టన్నుల మేత ఉందని మండల పశువైద్యాధికారి వెంకటరాజు తెలిపారు. దీంతో 50శాతం సబ్సిడీపై ప్రభుత్వం గడ్డి విత్తనాలు చిన్న కారు రైతులకు అందజేస్తుందని వెల్లడించారు. రాయితీపై గడ్డి, చొప్ప అందచేయాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలు చేసిన పశుగ్రాసాన్ని ట్రాక్టర్లో తరలిస్తున్న రైతులు

14,836 బస్తాల ధాన్యం సేకరణ

పెద్దేముల్: తాండూరు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మంబాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 14,836 బస్తాల వరి ధాన్యం (90మంది రైతుల నుంచి) సేకరించినట్లు కేంద్రం ఇన్‌చార్జి నజీర్ తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,060, బి గ్రేడ్‌కు రూ.2,040 చెల్లించినట్లు వెల్లడించారు. రైతులు ధాన్యంతో పాటు పట్టా పాసు బుక్, బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్‌తో పాటు గ్రామ పంచాయతీ రెవన్యూ కార్యదర్శుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని, గన్నీ సంచుల సమస్య లేదని పేర్కొన్నారు.



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మర్పల్లి: 33కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పూర్ణచందర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మర్పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మర్పల్లి టౌన్, మర్పల్లి ఇండస్ట్రీయల్ ఫీడర్, బూచన్‌పల్లి, కోట్‌మర్పల్లి, వీర్లపల్లి, కాల్లాపూర్, పంచలింగాల, పట్లూర్, పట్లూర్ తండా, ఘణాపూర్, రామాపూర్, జంషాద్‌పూర్ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే పల్లెబాట నేడు

కుల్కచర్ల: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ఆదివారం 'పల్లెబాట' కార్యక్రమం నిర్వహించనున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లాపూర్, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్, పటేల్ చెరువుతండా, బోట్యానాయక్ తండా, పీరంపల్లి, కామునిపల్లిలో పర్యటించనున్నారని తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కుల్కచర్ల: మట్టిలోనే మాణిక్యాలు దాగుంటాయని కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు కుమ్మరి స్వామి అన్నారు. సీఎం కప్ టోర్నీలో భాగంగా కుల్కచర్ల మండలం నుంచి 18మంది ఖోఖో క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి స్వామి క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాల పీఈటీ శంకర్, స్థానిక నేతలు పాల్గొన్నారు

ఆలయాల జీర్ణోద్ధరణకు పూర్తి సహకారం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: శిథిల దేవాలయాల జీర్ణోద్ధరణకు పూర్తి సహకారం అందజేస్తామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి చెప్పారు. శనివారం మండలంలోని సంకెపల్లిగూడలో ఇటీవల పునర్నిర్మించిన హనుమాన్ దేవాలయం, బొడ్రాయి ప్రాంతాన్ని ఆయన సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని శిథిలావస్థలో ఉన్న దేవాలయాల జీర్ణోద్ధరణ కోసం తన వంతుగా పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. హనుమాన్ ఆలయం పునరుద్ధరణకు గ్రామస్తులు తనను కోరిన వెంటనే రూ.2.50 లక్షల అందించామని చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల పునర్నిర్మాణాలకు విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో అంతర్గత సీసీరోడ్లు, మహిళా భవనం నిర్మాణాలు, తాగునీటి సమస్యకు సర్పంచ్ దర్శన్, ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, మహిళలు అవినాశ్ రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు.

సిబ్బందికి అదనపు డబ్బులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మైపాల్

అనంతగిరి: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అదనపు పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బందికి రోజుకు రూ.500లు అదనంగా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పనులు చేయాల్సి ఉండగా.. వారితో ఎక్కువ పనులు చేయిస్తున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి కార్మికులకు అదనంగా డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్య, శంకర్, భాస్కర్, రాజు, బాలయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

'సీఈఐఆర్'తో ఫోన్ రికవరీ

కొడంగల్ రూరల్: ఈ నెల 15వ తేదీన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మొగల్‌మడక గ్రామానికి చెందిన నర్సింహ.. కొడంగల్‌లో ఫోన్ పోగొట్టుకున్నారు. అదే రోజున బాధితుడు ఠాణాలో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ శంకర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రవిగౌడ్ సీఈఐఆర్ యాప్ ద్వారా లోకేషన్ ట్రాప్ చేశారు. కొడంగల్ వాసి వద్ద ఫోన్ ఉందని తెలుసుకొని అతని నుంచి ఫోన్ తీసుకున్నారు. అనంతరం శనివారం పోలీస్‌స్టేషన్‌లో నర్సింహకు ఎస్‌ఐ ఫోన్‌ను అందజేశారు.



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ రవిగౌడ్

కొనుగోలు కేంద్రం పరిశీలన

తాండూరు రూరల్: గౌతపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం రెవన్యూ ఆర్‌ఐ బాలరాజ్ పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇప్పటి వరకు 10 వేల గన్నీ బ్యాగులు అందజేశామని తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలిస్తున్నామని చెప్పారు. డీసీఎంఎస్ వద్ద భారీగా ధాన్యంతో ఉన్న ట్రాక్టర్లను ఖాంజాపూర్‌కు తరలించామని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

ధారూరు: వ్యవసాయ మార్కెట్‌కు ఒక్క శనివారం రోజే రైతులు భారీగా ధాన్యం తీసుకు వచ్చారు. అధికారికంగా 4,183 బస్తాలు వచ్చినట్లు తెలుస్తున్నా.. అనధికారికంగా సుమారు 8 వేల బస్తాల వరకు వచ్చినట్లు రైతులు తెలిపారు. అదే విధంగా 2,001 బస్తాల వరకు మొక్కజొన్న వచ్చిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నా.. 4 వేల బస్తాలు వచ్చినట్లు సమాచారం.



మార్కెట్లో ధాన్యం సంచులు

బాల్య వివాహాలను అరికట్టాలి

- చిన్నతనంలో పెళ్లి చేస్తే చర్యలు
- అవగాహన సదస్సులో అధికారులు

మర్పల్లి: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మర్పల్లి ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ సహాయకుడు కృష్ణారావు అన్నారు. శనివారం మానవ వనరుల కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని, బాలికలకు 18, బాలలకు 21 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. చిన్న తనంలో వివాహం చేస్తే బాలికలకు రక్తహీనతతో పాటు పుట్టబోయే బిడ్డ బలహీనంగా ఉంటుందని, ప్రసవ సమయంలో తల్లీ బిడ్డకు ప్రాణాపాయం ఉండవచ్చని వివరించారు. ఆర్‌ఐ మాధవరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే తమకు లేదా 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలోఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానాబేగం, 1098 మండల కోఆర్డినేటర్ యాదయ్య, వికారాబాద్ డివిజన్ బాలరక్షణ భవన్ కోఆర్డినేటర్ జ్యోతి, ఏపీఎం పోచయ్య, సీఆర్‌పీలు మైబల్లీ, మల్లేశం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు


దోమలో..

దోమ: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్‌లైన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతుంటాయని, అధికారులు సమన్వయంలో అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి బాలిక డిగ్రీ వరకు చదివించేలా తల్లితండ్రులను చైతన్య పరిచి, 21 ఏళ్లలోపు వివాహం చేయకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, పద్మ, శిశు సంక్షేమ మండల అధికారి షఫీ తదితరులు పాల్గొన్నారు.

విరుద్ధంగా లే అవుట్ చేస్తే చర్యలు

టౌన్ ప్లానింగ్ అధికారి శరబలింగం

పరిగి: నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్ చేస్తే.. కఠిన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారి శరబలింగం హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని 3వ వార్డు సర్వే నంబర్ 20లో 1–06గుంటల్లో లేఅవుట్ చేశారు. అక్కడ మున్సిపల్ శాఖ వేస్తున్న సీసీరోడ్డు పనులను సదరు ప్లాట్ వారు అడ్డుకున్నారు. దీంతో శనివారం టౌన్‌ప్లానింగ్ అధికారి లే అవుట్‌ను పరిశీలించి మాట్లాడారు. లే అవుట్‌లో 30ఫీట్ల రోడ్డు అని ఉండగా.. కొలతల్లో కేవలం 20ఫీట్ల రోడ్డే ఉందన్నారు. పక్క సర్వే నంబర్ ఇది ఒకే నంబర్ కావడంతో అందులో నుంచి రోడ్డు ఉందని గతంలో చూపించినట్లు వెల్లడించారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని లేఅవుట్ యాజమాన్యంతో మాట్లాడారు. సమస్య పరిష్కరించి రోడ్డుకు అనుమతులు ఇవ్వాలని చెప్పారు. లేదంటే లేఅవుట్ యాజమాన్యంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును కొలుస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారి

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

తాండూరు టౌన్: పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షహర్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పట్టణ సుందరీకరణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఇంట్లోని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి, పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. బట్టలు, పుస్తకాలు తదితర వస్తువులను మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అందజేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కృష్ణ, రాజేశ్వరి, శోభ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ తదితరులు